


# హైదరాబాద్ వార్త


## పట్నంలో పల్లెటూరి జాతర

### అపర్ణసరోవర్‌లో వైభవంగా ప్రభలతీర్థం



ప్రభలతీర్థంలో ఉత్సాహంగా మహిళలు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : పల్లెటూళ్లలో జరుపుకొనే ఊరిజాతర పట్నం తరలివచ్చింది. ఊళ్లల్లో ఆనందోత్సహాలతో మేళ, తాళాలతో ఊరేగింపులు నగరంలో కనువిందు చేశాయి. ఈశ్వరుడు విరాజిల్లుతున్న ప్రభలను పట్నం వాసులు తమ భూజాలపై ఎత్తుకుని శరభ నాధాలతో, ఆట, పాటలతో చిందులేసి వాఘాంగా గడిపారు. వీధి గారడి, మాయలోడు, రంగులరాట్నాలు, చిలకజోస్యాలు, కుమ్మరుల కుండలు,చేనేత హస్తకళల అంగళ్లు, ఆడప డుచుల చేతి గాజుల సవ్వళ్లు సందడిచేశాయి. వెదురుబొంగులతో ప్రభ లను కట్టి, పట్టుబట్టలను చుట్టి,గుమ్మడి కాయలు, వరికం కులు, పసి డికుం డలు, పాలవెల్లి, గంటలతో తయారు చేసిన దేవునిప్రభలను ఊరేగిస్తూ నగర శివార్లలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అపర్ణ సరోవర్ వాసులు పల్లె జాతరను పట్నంలో జరుపుకున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### డిసిపి రష్మీ పెరుమళ్



హైదర్షాకోట్‌లోని గౌతం మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్న డిసిపి రష్మీ పెరుమళ్

నార్సింగి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : పెరిగిన ఆధునిక సాంకేతికత వలన సైబర్ నేరాలు పెరిగాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ డిసిపి రష్మీ పెరుమళ్ పేర్కొన్నారు. సోమవారం హైదర్షాకోట్‌లోని గౌతమ్ మాడల్ స్కూల్‌లో సైబర్ నేరాలు-అప్రమత్తత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిసిపి మాట్లాడుతూ సోషల్ మీడియాల్లో వచ్చే లింకులపై క్లిక్ చేయవద్దని, ఫోన్‌లు చేసి ఎవరైనా ఓటిపి అడిగితే చెప్పవద్దని, లాటరీ తగిలిందని, తక్కువ వడ్డీకి లోన్ ఇస్తామని ఫోన్‌లు చేస్తే స్పందించ వద్దన్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం వంటి యాప్స్ వేసుకుంటే పాస్‌వర్డ్స్ ఇతరులకు కనిపించకుండా జాగ్రత్త పడాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కాలం చాలా విలువైందని, గడిచిన ఏ ఒక్క క్షణంను మనం తిరిగి తీసుకు రాలేమని, ప్రతీ క్షణంను మన ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని సూచించారు. సమయ పాలన పాటించిన వారు జీవితంలో ఉచ్చ స్థితిలో ఉన్నారని వివరించారు. ఉన్నత లక్షాలను ఎంచుకొని వాటి సాధన కోసం అహర్నిషలు కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, ఎస్.ఐ ప్రభాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోపణలు నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా

### టిఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ



ఐపిఎం డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణగౌడ్, శ్రీకాంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: తనపై వచ్చిన ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని టిఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఐపిఎంలోని కొంతమంది ఉద్యగ సంఘం నేతలు చేసిన ఆరోపణలను నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానని ఆయన ప్రకటించారు. ఆరోపణలు రుజువు చేయకపోతే ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నారాయణగూడలోని ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను కలిసి వినతిపత్రం సమర్పించారు. మిగతా సిటీ 3వ పేజీలో

### కూకట్‌పల్లి వై జంక్షన్‌లో

## మహిళ ఆత్మహత్య

మూసాపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : హైదరాబాద్ కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్ షాపింగ్ మాల్‌లో సోమవారం దారుణం చోటు చేసుకుంది. ది చెన్నై సిల్క్స్ షాపింగ్ మాల్‌లో హైస్ కీపింగ్ విభాగంలో నాలుగేళ్ళుగా విధులు నిర్వహిస్తున్న రమణమ్మ (50) అనే మహిళా ఉద్యోగి షాపింగ్ మాల్ రెండో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. హైస్ కీపింగ్‌లో పనిచేసే వారు కొంత కాలంగా తన తల్లిని వేధిస్తున్నారని రమణమ్మ కూతురు జాహ్నవి ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మత్తుకు బానిసలై..

## నిత్యం మత్తులో చిత్తవుతున్న యువత

**పార్కులు, నిర్మానుష్య ప్రాంతాలే అడ్డా**

**పీల్చేవారిలో స్కూల్, కాలేజీ విద్యార్థులే అధికం**

**వ్యసనంగా మారుతుంటంతో జీవితాలు నాశనం**



హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: సిగరేట్.. మద్యపానం విద్యార్థులకు ఫ్యాషన్‌గా మారింది. ఇది చాలదన్నట్లుగా ప్రస్తుతం వారు గంజాయి స్థాయికి చేరుకుంటున్నారు. ఇప్పటికే సిగరేట్ అలవాటు ఉన్నవారు ఆమత్తు చాలదన్నట్లు సిగరేట్‌లోని పొగాకు పదార్థాన్ని తీసేసి దాంట్లో గంజాయి నింపుకుని పీల్చుతు న్నారు. పుస్తకాలు పట్టాల్సిన చేతులతో గంజాయి పీలుస్తూ ఆమత్తులో జోగుతున్నారు. అసమయంలో ఎవరైనా ప్రశ్నిస్తే వారికి కొట్టడానికి సైతం వెనకాడటం లేదు. ఎక్కడంటే అక్కడ.. ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులో ఉండటంతో గంజాయి వినియోగం రోజురోజుకూ అధికమౌతోంది. యువకులే కాదు..విద్యార్థులు,అమ్మాయిలు సైతం గంజాయి మత్తులో తూగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల నగరంలోని పలుప్రాంతాల్లో దాడులు నిర్వహించిన పోలీసులకు ఒకే రోజు కోటికి పైగా విలువైన గంజాయి దొరికింది. దీన్ని బట్టి నగరంలో గంజాయి వినియోగం ఎంత ఉందో ఇట్టే అర్థమౌతుంది. విద్యార్థులే లక్ష్యంగా కొన్ని ముఠాలు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది. వైజాగ్ తదితర ప్రాంతాల నుండి గంజాయిని తీసుకువచ్చి శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని విద్యార్థులకు, యువకులకు సరఫరా చేస్తున్నారు.దీంతో ఈ మత్తుకు బానిసవుతున్న విద్యార్థులు డబ్బుల కోసం నేరాల బాట పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడౌతుంది.ఇటీవల ఎల్బీనగర్‌లోని వనస్తలిపురంలో గస్తీలో ఉన్నపోలీసుల గంజాయి పీలుస్తున్న ఓయువకుడిని పట్టుకోగా ఇంటర్మీడియట్ చదువుతున్న అతడు గంజాయికి మత్తుకు బానిసై నేరాల బాట పట్టాడని తేలింది. ముఖ్యంగా బస్తీలు, కాలనీల్లోని యువత నగరంలో గంజాయి బాటపట్టి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇందులో ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటిస్థానంలో ఉండగా.. ఇంటర్మీడియట్,డిగ్రీ విద్యార్థులు రెండో స్థానంలో ఉన్నారు.

**నైట్‌ఔట్ పేరు చెప్పి బయటికి..** మత్తుకు అలవాటు పడిన యువత చాలా మంది తమ ఇండ్లలో నైట్‌ఔట్ పేరు చెప్పి బయటికి వస్తున్నారు. సాధారణంగా తల్లిదం డ్రులు నైట్‌ఔట్ అనగానే స్నేహితులతో చదువుకునేందుకు వెళ్తున్నట్లు భావిస్తున్నారు. కానీ.. నైట్‌ఔట్ అంటే గంజాయి తాగిన తర్వాత రోడ్లపై షికారు చేయడం, నిర్మానుష్య ప్రాంతాల్లో రాత్రిపూట ఎవరైనా ఒంటరిగా కనపడితే వారిని దోచుకోవడం చేస్తున్నారు. ఇలా చాలా మంది యువకులు రాత్రి 10గంటల తర్వాత నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాల్లో సంచరిస్తుననట్లు తెలుస్తుంది.

**పార్కులు, నిర్మానుష్య ప్రాంతాలే అడ్డాలు..** శివారు ప్రాంతాల్లోని పార్కులు, చెరువులు,గుట్టలను యువత అడ్డాలుగా చేసుకుని అక్కడ గంజాయిని సేవిస్తున్నారు. గంజాయిని సిగరేట్లలో నింపుకుని వాటిద్వారా మత్తును ఆస్వాధిస్తున్నారు. ఆసమయంలో స్థానికులు ఎవరైన వెళ్ళి మీరు ఏం చేస్తున్నారు..అని ప్రశ్నించినా వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు. చాలా మంది చదువుకోవడం కోసం నగరానికి వచ్చి.. శివారు కాలేజీల్లో చేరి ఆతర్వాత చదువును పక్కన పడేసి గంజాయి దమ్ములను పీలుస్తూ విద్యాభ్యాసాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు కళాశాల విద్యార్థులపై నిరంతరం నిఘా పెడుతూ వారుదారి మళ్లకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఒక్కసారి పీల్చారంటే..** గంజాయి ఆకును ఒక్కసారి పీల్చామంటే దానికి దూరం కావడం కష్టం. ప్రతి వ్యక్తి శరీరంలో ఆల్కహాల్ ఎంతఅవసరమో అంతే ఉండాలి. అవసరమైన దానికంటే ఎక్కువ డ్రగ్స్ తీసుకునే వారి ఆయుష్షు రోజురోజుకూ తగ్గిపోతుంది. అంతేకాకుండా సమయానుకూలంగా మత్తుకావాలనే కోరిక పుడుతుంది. ఏదేని మత్తు దొరకని సమయంలో దీనికి అలవాటుపడిన వారు విచక్షణ కోల్పోయి ఎదుటివారిపై దాడి చేసే ప్రమాదం లేకపోలేదు.

## తెలంగాణలో 10 ఎంపీ స్థానాల్లో గెలుస్తాం : లక్ష్మణ్

- అణ్వాస్త్రాన్ని మించిన బ్రహ్మాస్త్రం ప్రధాని మోడీ
- రూ.34.లక్షల కోట్లు నేరుగా లబ్దిదారుల అకౌంట్లలో వేశాం
- చేవెళ్లలో భారీ మెజారిటీని సాధిస్తాం



గంధంగూడలో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఓబిసిసెల్ జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్

నార్సింగి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 10.ఎంపి స్థానాల్లో గెలుస్తామని ఓబిసిసెల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం చేవెళ్ల పార్లమెంట్ స్థాయి సమావేశంను గండిపేట మండలం గంధంగూడలో ఏర్పాటు చేశారు. "గావ్ చలో... ఘర్ చలో" కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందే ఇండియా కూటమి కాడి వదిలేసిందన్నారు. నితీష్ ఎన్డీఏలో చేరగా, మమత బెనర్జీ కాంగ్రెస్‌కు 2.సీట్లు ఇస్తామని, దమ్ముంటే రాహూల్ వారణాసీలో గెలిచి చూపాలని సవాల్ విసిరారన్నారు. కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్‌లు సైతం కాంగ్రెస్ పట్ల విముఖంగానే ఉన్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఐదు శతాబ్దాల కల అయిన అయోధ్య రామమందిరం పూర్తి చేశారని, అత్యంత జఠిలమైన త్రిపుల్ తలాక్, 370.ఆర్టికల్స్‌ను తొలగించి, జమ్మూలో శాంతియుత వాతావరణంను నెలకొల్పారన్నారు. వేల కోట్ల అభివృద్ధి పనులతో పాటు 142.సంక్షేమ పతకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఒక్క స్కాం జరుగకుండా నీతివంతమైన పాలన అందిస్తున్నామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా, ఒక్క రూపాయి కోతకు గురి కాకుండా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి కేంద్ర సర్కారు రూ.34.లక్షల కోట్లను జమ చేసిందన్నారు. మోడీ తీసుకున్న సంస్కరణల వలన రక్షణ, రవాణా, అంతరిక్షం, పారిశ్రామికం ఇలా అన్ని రంగాలలో నేడు భారత్ దూసుకు పోతుందన్నారు. దేశ ప్రజలంతా మోడీ వైపే ఉన్నారని, కేంద్రం అమలు చేసిన పతకాలన్నింటిని మిగతా సిటీ 3వ పేజీలో

# అధికారా.. మజాకా!

**రిజిస్ట్రేషన్ల శాఖలో పదవుల పండుగ**

**మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్‌కు జోడు పదవులు**

**కార్యాలయాల్లో ముడుపులిస్తేనే పనులు**

**ఆస్తులు, అమ్మినా కొనుగోలు చేసినా మామూళ్ళు ఇవ్వాల్సిందే. డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్ల చేతులు తడపందే ఫైళ్ళు కదలని పరిస్థితి ఈ కార్యాలయాల్లో నెలకొంది. ఎంతో కొంత ముట్టచెబితే పనులు చేయడంలేదని, డిమాండ్ చేసిన మామూళ్ళు ఇస్తేనే రిజిస్ట్రేషన్లకు కొందరు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.**




మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఆయన ఒక్కరే రెండు పదవులు స్వీకరించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రధాన కార్యలయం ఉన్నతాధికారుల అండదండలతో పదవుల పండగ చేసుకోవచ్చనడానికి మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) ఉదహరణగా చెప్పవచ్చు. మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సంతోష్‌కి రిజిస్రేషన్ల శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న ఆయనకు ఇది రెండో పదవి కావడం విశేషం. అయితే ఆయన ఒక్కరే ఇక్కడ అక్కడ రెండు పదవులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఉన్నతాధికారుల అండదండలతో ఇక్కడ పోస్టు దక్కించుకున్న డీఆర్ ఎక్కువ శాతం ప్రధాన కార్యాలయంలోనే ఉంటూ ఇక్కడ విధులకు అంతంత మాత్రంగా వస్తుండడంతో రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో మేడ్చల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని పర్యవేక్షించే వారు లేకపోవడంతో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోట్ల ఆదాయాన్ని సమకూర్చిపెట్టే రిజిస్ట్రేషన్ల శాఖపై ఉన్నతాధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. డీఆర్‌గా పూర్తి బాధ్యతలను అప్పగించిచిన ఉన్నతాధికారులు ప్రధాన కార్యాయంలో ఆయనకు ఇన్స్‌పెక్టర్ జనరల్ స్థానంలో ఇన్‌చార్జ్‌గా కుర్చీలో కూర్చోబెట్టవలసిన అవసరం ఏముందో ఉన్నతాధికారులే చెప్పాలి. రిజిస్రేన్ల శాఖలో గత కొన్నేళ్ళ నుంచి బదిలీలు లేకపోవడంతో అనేక మంది పోస్టుల కోసం ఎదురు చేస్తున్నారు. ఒక చోట పనులు నిర్వహిస్తోన్న డీఆర్‌కు ప్రధాన కార్యాలయంలో అదనపు బాధ్యతలు అప్పగించడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**జిల్లా రిజిస్ట్రారా మజాకా..**
**రావడం పోవడం ఆయన ఇష్టం..**

అయితే ఆయన ఒక్కరే మేడ్చల్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు రిజిస్ట్రేషన్ల శాఖ ప్రధాన కార్యాలయం(ఇక్కడ అక్కడ) రెండు పదవులు నిర్వహిస్తుండడం తో ఎక్కువ శాతం ఐజి కార్యాలయంలోనే ఉంటూ ఇక్కడ విధులకు అంతంత మాత్రంగా హాజరవుతూ ఆయనకు ఇష్టం వచ్చినప్పుడు వచ్చిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా రిజిస్ట్రార్ ఇక్కడకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడి అధికారులు, సిబ్బందికి డీఆర్ ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉందంటే ఇక ప్రజల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. సార్ లేరా అంటే రాలేదని, ఎప్పుడు వస్తారని అడిగితే తమకు తెలియదని సమాదానం చెబుతారు. ఒకరు మధ్యాహ్నం వస్తారని చెబితే మరొకరు సాయంత్రం నాలుగు గంటలకు వస్తారని చెబుతారు. మరుసటి రోజు వచ్చినా అధికారి లేకపోవడంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

**ఈ కార్యాలయాల్లో ముడుపులిస్తేనే పనులు..**
**రూ.కోట్ల ఆస్తుల్ని కూడబెడుతున్న అధికారులు**

మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) కార్యాలయంతో పాటు కుత్బుల్లాపూర్, నారపల్లి, ఘట్కేసర్, ఉప్పల్, మేడ్చల్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్1 కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనలో రికార్డు సృష్టిస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టిసారించకపోవడంతో కొందరు అధికారుల అక్రమ వసూళ్ళకు అడ్డే లేకుండా పోయింది. కొందరు సబ్ రిజిస్ట్రార్లు తమకు ముడుపులు అందిన డాక్యుమెంట్లు, ఏజెంట్లు తీసుకువచ్చే డాక్యుమెంట్ల విషయంలో ఒకలాగా నేరుగా వచ్చిన డాక్యుమెంట్ల విషయంలో మరోలాగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదేమంటే రిజిస్ట్రేషన్ల చట్టంలోని ఏదో ఒక రూల్ చెప్పి కొర్రీలు పెట్టి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారిని మామూళ్ళ కోసం జలగల్లా పీడిస్తున్నారు. ఆయా సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిపై తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు వస్తున్నా అవే సీట్లలో కొనసాగుతున్నారు. దీంతో అమ్యామ్యాలు లేనిదే రిజిస్ట్రేషన్లు జరుగడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆస్తులు, అమ్మినా కొనుగోలు చేసినా మామూళ్ళు ఇవ్వాల్సిందే. డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్ల చేతులు తడపందే ఫైళ్ళు కదలని పరిస్థితి ఈ కార్యాలయాల్లో నెలకొంది. ఎంతో కొంత ముట్టచెబితే పనులు చేయడంలేదని, డిమాండ్ చేసిన మామూళ్ళు ఇస్తేనే రిజిస్ట్రేషన్లకు కొందరు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ రూ.కోట్ల ఆస్తుల్ని కూడబెడుతున్నట్లు, వీరికి నగరం, శివార్లతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఐఎఎస్ అధికారి జెడ్సీ అభిలాష అభినవ్




కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వివిధ సమస్యల్ని పరిష్కరించుకోవాలని ఐఎఎస్ అధికారి, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ కోరారు. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ జోన్‌లోని 23,24,25,26,27 మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ సర్కిళ్ళలో సమస్యలు ఉంటే డిప్యూటీ కమిషనర్లతోపాటు ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఆస్తిపన్ను విభాగం అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి గ్రేటర్ అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని సర్కిళ్ళలో కనీస సదుపాయాల కల్పనకు ప్రణాళికల్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధిపనుల్ని వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. పారిశుద్యం మెరుగుకు చర్యలు తీసుకోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ అధికారులు చూడాలన్నారు. ప్రజలు కూడా చెత్తా, చెదారాలను రోడ్లపై వేయకుండా సహకరించాలని కోరారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో 21, మూసాపేట 6 కూకట్‌పల్లి 1, కుత్బుల్లాపూర్ 3, అల్వాల్14 గాజుల రామారం 12 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ తెలిపారు.

## తెలుగు రాజకీయ నవలలకు ఆద్యుడు వట్టికోట ఆళ్వార్‌స్వామి

**నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తెలంగాణ ప్రజాసాహిత్యానికి ప్రాణం పోసిన వ్యక్తి వట్టికోట ఆళ్వార్‌స్వామి అని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ అన్నారు. ఉద్యమకారుడు వట్టికోట ఆళ్వార్‌స్వామి వర్ధంతి కార్యక్రమం సోమవారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. అళ్వార్‌స్వామి చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం పద్మజ మాట్లాడుతూ తమ గ్రంథాలయానికి ఇప్పటికే ప్రభుత్వం అశోక్‌నగర కేంద్ర గ్రంథాలయానికి వట్టికోట ఆళ్వారుస్వామి పేరును పెట్టడం జరిగిందన్నారు.

### బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు

## కలిసి కట్టుగా పనిచేయాలి : తలసాని



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న సుబ్రమణ్య టెంపుల్ ట్రస్ట్ బోర్డుమెంబర్ చొల్లేటి రమేశ్, న్యూక్లబ్ అధ్యక్షుడు నోముల ప్రకాశ్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: వచ్చేపార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్, కంటోన్మెంట్ పార్లమెంట్ సీట్లను బిఆర్ఎస్ కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయా లని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సూచించారు. సోమవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో సుబ్రమణ్య స్వామి దేవాలయం ధర్మకర్త చొల్లేటి రమేశ్, న్యూక్లబ్ అధ్యక్షుడు నోములప్రకాశ్, ఆర్యవైశ్య సంఘం గంగి శెట్టి సూర్యప్రకాశ్, లింగ మధు, రాజశేఖర్‌లు ఎమ్మెల్యే తలసానిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు.

## కుత్బుల్లాపూర్‌లో బిఆర్ఎస్ నేతల నిరసన

### ముఖ్యమంత్రి వాఖ్యలకు నిరసనగా రాస్తారోకో



షాపూర్‌నగర్ చౌరస్తాలో సి.ఎం.రేవంత్‌రెడ్డిదిష్టిబొమ్మ దగ్ధం

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వాఖ్యలకు ఉవ్వెత్తున నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. తెలంగాణ రాష్ట్ర సమితి కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల అధ్యక్షులలతోపాటు వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కుత్బుల్లపూర్, షాపూర్‌నగర్ చౌరస్తాలవద్ద గుమిగూడ ఆందోళన నిర్వహించారు. యావత్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు రోడ్లపైకి వచ్చి సి.ఎం. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. తెలంగాణ సాధనకోసం చావునోట్లో తలపెట్టి సాధించిన తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలూ కృషిచేసిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. అని కొనియాడారు. ఈసందర్భంగా టిఆర్ఎస్ నాయకులు ఎత్తరి మారయ్య, పుప్పాల బాస్కర్, రుద్ర అశోక్, పద్మక్క, గుబ్బల లక్ష్మీనారాయణ, దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, పోలే శ్రీకాంత్, పుప్పాల బాస్కర్, న్యాయవాది కమలాకర్‌లను పోలీసులు అరెస్టుచేసి స్వంతపూచికత్తుపై విడిచిపెట్టారు.

**కుత్బుల్లాపూర్ చౌరస్తాలో**
**రాస్తారోకో. . భారీగా నిలిచిన వాహనాలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వాఖ్యలకు నిరసనగా కుత్బుల్లాపూర్ చౌరస్తాలో టిఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున రోడ్డుపై బైఠాయించి రాస్తారోఖో నిర్వహించారు.పార్టీ సీనియర్ నాయకులు గౌసొద్దిన్, మథిన్, యేసుబాబు, గుమ్మడి మధుసూదన్ రాజు, నల్ల ప్రసాద్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, తీగెల ఈశ్వర్‌గౌడ్, బి.కార్తీక్‌గౌడ్ , రంగారెడ్డినగర్ వెంకటేశ్ టిఆర్ఎస్ యువజన నాయకులు రమేశ్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనితో జీడిమెట్ల సబ్ఇన్‌స్పెక్టర్లు సతీష్‌రెడ్డి, నాయుడుల ఆధ్వర్యంలో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నాలా ఆక్రమణ తొలగింపు

అల్వాల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ఆక్రమణదారులు నాలాలను కూడా వదలడం లేదు. చినరాయుని చెరువు నుంచి హస్మత్ పేట్ చెరువుకు అనుసందానం చేసే నాలా ఆక్రమణలకు గురైంది. నాలా పరివాహక ప్రాంతంలో మట్టిని నింపి బేస్‌మెంట్ నిర్మాణం జరపడం జరిగింది. విషయం అధికారులు దృష్టికి రావడంతో సోమవారం ఆక్రమణను జెసిబి సహకారంతో తొలగించారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని టెలికాం కాలనీ వద్ద ఆక్రమణ పర్వం సాగింది. నాలాలోని సుమారు పది అడుగులు ఆక్రమణదారులు తమ స్థలంలోకి కలిపే ప్రయత్నం చేశారు. నాలా పది అడుగులకు కుచించుకుని పోయింది. వరద నీటి ప్రవాహాన్ని ఈ ఆక్రమ కట్టడం అడ్డుకోవడం ద్వారా స్థానిక కాలనీలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. సకాలంలో స్పందించిన యంత్రాంగం ఆక్రమణను తొలగించడం పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజావాణిని పౌరులు సద్వినియోగం చేసుకోవాలి



వినతులు స్వీకరిస్తున్న డిసి

**డిసి శ్రీనివాస్ రెడ్డి**

అల్వాల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణిని నిర్వహిస్తున్నామని అల్వాల్ సర్కిల్ డిసి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. పెద్ద సంఖ్యలో పౌరులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను డిసికి అందించారు. పలు సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ప్రజావాణిని మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం అన్ని విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కారం చేస్తున్నామని వివరించారు. డ్రైనేజీ, మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు అధికంగా వస్తున్నాయని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యత ఉంటుందని డిసి స్పష్టం చేశారు.

## ముగిసిన 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ టోర్నమెంట్



కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నిజాంపేట్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో జరిగిన కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ టోర్నమెంట్ ఆదివారం చివరి 4వ రోజు పోటాపోటీగా ముగిశాయి. బాలుర విభాగంలో సాయి కబడ్డీ టీమ్ (స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఇండియా) గెలుపొంది మొదటి బహుమతి కైవసం చేసుకుంది. అలాగే బాలికల విభాగంలో మొదటి బహుమతి సాయి (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) కైవసం చేసుకుంది. గెలుపొందిన కబడ్డీ టీమ్‌లకు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఆమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కాసాని వీరేష్ ముదిరాజ్‌లు బహుమతులను అందజేశారు. బహుమతితోపాటు క్యాష్ ప్రైస్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి కబడ్డీ కోచర్స్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవ మేధాపై కృతిమ మేధా ప్రభావం అనే అంశంపై సదస్సు

నిజాంపేట్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : ఆధునిక సాంకేతిక యుగంలో మానవ మేధపై కృతిమ మేధ పైచెయ్యి సాధిస్తోందా అనే అంశంపై విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ వారి సహకారంతో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ అంశంపై ఐఎస్టిడి చైర్మన్ డాక్టర్ ఎస్.ఆనందరెడ్డి మాట్లాడుతూ మానవ వనరుల రంగంలో చోటు చేసుకున్న అనేక అంశాలను విద్యార్థులు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కృతిమ మేధ అభివృద్ధి వల్ల సమాజంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని, దాని ప్రభావం మానవ మేధ పైన కూడా పడుతుందని తెలిపారు. కానీ మానవ మేధను ఉపయోగించకుండా సాంకేతికంగా అభివృద్ధి సాధించడం అసాధ్యమని అన్నారు. గ్లోచెమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన హరిశంకర్, చీఫ్ ఫంక్షన్ ఆఫీసర్, జోదాస్ ఎక్స్‌పోయిమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆనంద్ విజయ్‌లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కృష్ణమోహన్, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితుడి రిమాండ్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : జనవరి 29న ఒకవ్యక్తి హత్య, మరోవ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసును మార్కెట్ పోలీసులు ఛేధించారు. నిందితుడు నిజామాబాద్‌కు చెందిన మోసిన్‌ఖాన్‌ను అరెస్ట్ చేసి రిమండ్‌కు తరలించినట్లు ఉత్తరమండలం అదనపు డీసీపీ జి మదుసూధన్‌రావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 29న అర్ధరాత్రి యశోధ హస్పిటల్ సమీపంలో ఒక వ్యక్తిపై దాడి చేసి 8వందల రూపాయలు లాక్కొని పారిపోయాడని నితిలేష్ ఇచ్చిన ఫిర్యాదుతో సంఘటన స్థలానికి చేరుకున్న మార్కెట్ పోలీసులు అప్పటికే నిందితుడు పారిపోవడంతో గాంలించే ప్రయత్నం చేశారు. మరోక వ్యక్తిపై కత్తితో దాడి చేసి పారిపోయాడని గుర్తించామన్నారు. తీవ్ర రక్తస్రావంతోఉన్న వ్యక్తిని గాంధీఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్‌లు దృవీకరించారని తెలిపారు. అయితే నిందితుడు బోధన్, నిజామాబాద్‌కు చెందిన మోసిన్‌ఖాన్‌గా గుర్తించి ప్రత్యేక టీంను రంగంలోకి దించి నిజామాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. మద్యానికి బానిసై మద్యం కొనడానికి డబ్బుల కోసం ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తెలిందన్నారు. బోధన్‌లో కూడా చోరీకి పాల్పడి జైలుశిక్ష అనుభవించాడని, సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా దాడికి పాల్పడ్డట్లు కేసు నమోదైనట్లు చెప్పారు.

## ఘనంగా మిస్-మిస్‌ఇండియా గ్రాండ్ ఫినాలే వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: యువతులు, మహిళలు హోయలుపోతూ ర్యాంప్‌వాక్ చేస్తూ సందడి చేశారు. వీనస్ స్టార్‌లైట్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మిస్-మిస్ సౌత్‌ఇండియా గ్రాండ్‌ఫినాలే వేడుకలు సోమాజిగూడలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. అధ్యంతం రసవత్తరంగా జరిగిన ఈకార్యక్రమంలో యువతులతో పోటీగా మహిళలు విభిన్న డ్రస్సులతో వాక్‌చేస్తూ కనువిందు చేశారు. ఈవేడుకలకు నటుడు, మాజీ ఎంపి మురళీమోహన్,వైఎస్ భారతిలు హాజరై వేడుకలను ప్రారంభించి పోటీల్లో పాల్గొన్న యువతులు, మహిళలను సత్కరించారు. ఒకేసారి మిస్..మిసెస్ పోటీలను సౌత్‌ఇండియా లెవెల్‌లో ఏర్పాటు చేయడం మంచి పరిణామమని, వేడుకలకు నాందిపలికిన నిర్వాహకులు జయంతి రామచంద్రన్ , వీనస్ ఫిల్మ్ ఎండీ జేజే కశ్యప్‌లను అభినందించారు. ఈపోటీలకు న్యాయనిర్ణేతలుగా సీనియర్ జర్నలిస్టు ప్రభు, పలుఅందాల పోటీల విజేతలు ఉషా ప్రసాద్, ప్రియాంక సర్కార్, సోనిభట్ సుధాజైన్‌లు వ్యవహరించారు. మిస్‌సౌత్ ఇండియాగా సునీత, రన్నరప్‌గా మహాలక్ష్మీ, మిసెస్ సౌతిండియాగా చరిత, రన్నరప్ అష్మీగెలిచారు. వారికి నిర్వాహకులు కిరీటాలు అందించి ఘనంగా సత్కరించారు.

## కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ద్వారా ఇవ్వాలి

**మంత్రి రాజనర్సింహ్మకు ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వినతి**



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బైరి వెంకటేశం, అశోక్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: ఎస్సీ ఉపకులాల కులధ్రువీకరణ పత్రాలను ఆర్టీవోలద్వారా కాకుండా తహసీల్దార్ల ద్వారా ఇచ్చే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇప్పించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి మంత్రి దామోదర రాజనర్సింహ్మకు విన్నవించారు. ఈమేరకు సోమవారం మంత్రి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌కుమార్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితులందరికీ ఒకే స్థాయి అధికారి ద్వారా కులధ్రీవకరణ పత్రాలు జారీ చేయాలని, ఆర్డీవో పరిధిలో కులపత్రాలు ఇవ్వడం వల్ల ప్రజలకు అధికారులచుట్టూ ఆరునెలలవరకు ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిప్పుకుని చివరకు లంచాలు లేనిదే కులపత్రాలు ఇవ్వడం లేదన్నారు. సకాలంలో కులపత్రాలు అందక ప్రభుత్వం పథకాలకు, విద్యకు దూరమవుతున్నారని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వచ్చేబడ్జెట్ సమావేశాల్లోనే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### బేగంపేట్ సిఐ రామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్‌ఎస్ నేతలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా రామయ్య పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం కంటోన్మెంట్ 2వ వార్డుకు చెందిన బిఆర్‌ఎస్‌న నాయకలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, నరేశ్, నయీం, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డగుట్టలోఅబివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్

## నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : లింగాని ప్రసన్న

అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మోండా కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. సోమవారం అడ్డగుట్ట నార్తలాలాగూడ, శాంతి నగర్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న సివరేజ్ పైప్‌లైన్ పనులను ఆమె పర్యవేక్షించారుక. అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహకారంతో అడ్డగుట్టను మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు వేణు, క్రిష్ణప్రసాద్, బిఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, పి.శ్రీనివాస్ గౌడ్, అమర్, హన్మంత్, ఎండి.ఇస్మయిల్, గోపీ, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



**విఎస్‌టీ కాలనీలో పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్**

నాచారం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: నాచారం విఎస్‌టీ కాలనీలో రూ.10లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పర్యవేక్షించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించి రోడ్డును వేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, సువర్ణ, సుగుణాకర్, కట్టబుచ్చన్న గౌడ్, సెవరేజ్ సూపర్ వైజర్ రాకేష్‌పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా విద్యను అభ్యసించాలి : ఎమ్మెల్యే వివేకానంద

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు. సోమవారం 132 జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ విమానపురి కాలనీలోని ది మాస్టర్ మైండ్ స్కూల్ రెండవ బ్లాక్‌ను ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, అజీష్, వేణు, బాల్‌రాజ్, శ్యామ్, బలరాం, సమ్మయ్య నేత, సిద్ధిక్, నదీమ్‌రాయ్, స్కూల్ చైర్మన్ రాజు డైరెక్టర్లు యాదగిరి, జగత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మధుబన్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తా

**కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**



మధుబన్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి,అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త : మధుబన్ కాలనీలో సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులు ఎదురొ్కంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుబన్ కాలనీ వాసులు ఎదురొ్కంటున్న సమస్యలను పరిష్కరించటానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండ ఉండేలా అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, లిక్కి వెంకటేశ్వర్, లక్ష్మయ్య, రజ వర్ధన్‌రెడ్డి, చిన్న, కృష్ణారెడ్డి, గోపీ, ఏన్ను శంకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండుతో పాల్గొన్నారు.

## నేటి నుంచి 2వ వార్డులో సాయన్న ప్రథమ వర్ధంతి



విలేకర్ల సమావేశంలో 2వ వార్డు బిఆర్‌ఎస్ నేతలు నరేశ్, అంజనేయులు, రఘురామ్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గానికి 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన దివంగత మాజీ ఎమ్మెల్యే ప్రథమ వర్ధంతి వేడుకలు కంటోన్మెంట్ 2వ వార్డులో మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతామని బిఆర్‌ఎస్ నాయకులు అంజనేయులు, ఏ.జె.రఘురామ్, నరేశ్, నయీం, జిలానీలు తెలిపారు. సోమవారం రసూల్‌పురాలోని ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత సహాయ సహకారాలతో నేటి నుంచి ఈ నెల 19 వరకు 2వ వార్డులోని వాడ వాడల్లో ప్రథమ వర్ధంతి వేడుకలు బారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు జిలానీ, శ్యామ్, శ్రీనివాస్ ముదిరాజ్, ధన్‌రాజ్, గపూర్, గౌస్ తదితరుల పాల్గొన్నారు.

## మల్లాపూర్ డివిజన్‌ను సమస్యలేని డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మల్లాపూర్ ఎస్వీనగర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నాచారం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మల్లాపూర్ డివిజన్‌ను సమస్యలు లేకుండా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిడ, కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్వీనగర్ నుంచి భవాని నగర్ రోడ్డు నెం.5 పెద్ద నాలా వరకు రూ. 27 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పనులకు సోమవారం స్థానిక కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వం చేయకుండా నాణ్యత ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం. సంతోష్, డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, కాలనీ వాసఉలు నెమలి రవికుమార్, శ్రావణ్, రవి చారి, చంద్రకాంత్, యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు తండ వాసుదేవ్ గౌడ్,కటార్ల భాస్కర్,హమాలీ శ్రీను,కుంటి కృష్ణ, శ్రీనివాస్ రెడ్డిడ, సుధాకర్ రెడ్డి, సత్తయ్య, అనిల్, లంబు శ్రీను తధితరులు పాల్గొన్నారు.

## బిసిలకు ఎనిమిది పార్లమెంట్ సీట్లు కేటాయించాలి



బిఆర్‌ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కృష్ణయాదవ్, శ్రీనివాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు ఎనిమిది సీట్లు కేటాయించాలని బిఆర్ఎస్, కాంగ్రెస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలను బిసి సేన కోరింది. ఈమేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఇంచార్జ్ శ్రీనివాస్‌రెడ్డి, గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలరాజ్, బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డిలను కలిసి మోమోరండం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సామాజిక న్యాయ స్పూర్తికి విరుద్ధంగా బిసిలను రాజకీయంగా అణిచివేస్తున్నాయని అన్నారు. జనాభా దమాషా ప్రకారం విద్యా, ఉద్యోగ,ఆర్థిక, రాజకీయ,ఉపాధి రంగాల్లో సమాన వాటా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సేన నాయకులు ఆకుల శ్రీనివాస్, శివ రాములు, వెంకటేష్‌యాదవ్, సెలేటి వెంకటేష్, గొడుగు నరసింహులు ,మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

నిజాంపేట్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 344 తుర్క చెరువు శిఖం కబ్జా, సర్వే నెంబర్ 233/13 కబ్జా, సర్వే నెంబర్ 191 అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద, సర్వే నెంబర్ 191 రాజీవ్ గృహకల్ప బస్‌స్టాప్ అక్రమ నిర్మాణాలు, సర్వే నెంబర్ 134 ఎర్ర కుంటలో అక్రమ నిర్మాణాలు సర్వే నెంబర్ 109 ప్రభుత్వభూమి కబ్జా, అక్రమ నిర్మాణాలు, సర్వే నెంబర్ 94, 90లో అక్రమ నిర్మానాలు, సర్వే నెంబర్ 87వేజ్, నాన్‌వెజ్ మార్కెట్ కబ్జా, 82 మున్సిపల్ పార్కుపై సీపీఐ మండల కార్యదర్శి పాలబిందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజగిరి జిలాల కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని ఎక్కడ చూసిన కబ్జాల పర్వం కొనసాగుతుందన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ సర్వే నెంబర్ 334, 233, 191, 134, 109, 87లో గత కొంత కాలంగా కబ్జాలు, అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని అన్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కళలను, కళాకారులను ప్రోత్స హించడానికి త్యాగరాయ గానసభ అండగా ఉంటుంది

**త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి**



పేరి నాగేశ్వరరావు దంపతులకు యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు పత్రాన్ని అందించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కళలను, కళాకారులను ప్రోత్స హించడానికి త్యాగరాయ గానసభ అండగా ఉంటుందని ఆ సంస్థ అధినేత కళావిఎస్. జనార్దనమూర్తి అన్నారు. శ్రీద్యుతిమ్యూజికల్ అకాడమి, ఇషాన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ సమర్పణలో మధుర గానలహరి కార్యక్రమం సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేతలు పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా విజయా క్రియేషన్స్ పేరుతో నూతన సాంస్కృతిక సేవా సంస్థ ప్రారంభోత్స వ కార్యక్రమం జరిగింది. కళావిఎస్.జనార్దనమూర్తి మాట్లాడుతూ గానసభలో అద్భుతమైన వేదికలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ వీణ వాద్యనిపుణులు పేరి సీత పాల్గొని ప్రసంగిస్తూ సంగీతపరంగా ఎందరో గాయకులకు ఈ సంస్థ అవకాశాలను కల్పిస్తూ సామాజికపరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పేరి నాగేశ్వరరావు దంపతులు అభినందనీయులు అని అన్నారు. భారత్ వరల్డ్ రికార్డ్స్ సీఈవో రమణారావు యూని వర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు పత్రాన్ని పేరి నాగేశ్వరరావు దంపతులకు అందించారు.

### తెలంగాణలో 10 ఎంపీ స్థానాల్లో గెలుస్తాం : లక్ష్మణ్

**మొదటి పేజీ తరువాయి..**

గడప గడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్య పర్చా ల్సి న బాధ్యతు నాయకులు, కార్యకర్తలు సమర్థవం తంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీనియర్ నేతలు మల్లారెడ్డి, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేఎస్.రత్నం, సామ రంగారెడ్డి, సునీత, నర్సి హ్మారెడ్డి, మహాలింగంగౌడ్, మల్లారెడ్డి, మహేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

## ట్రాఫిక్ ఇబ్బందులపై చర్యలు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్‌బి కాలనీ సమీపంలో గల తాసిల్దార్ ఆఫీస్ లైన్‌లో ఎక్కువగా ఉన్న రోడ్డును కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. ఇక్కడి రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి పూలబండ్లు, కూరగాయల బండ్ల వారితో మాట్లాడి రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండడం కోసం రోడ్డుకు ఇరువైపులా నాలుగు ఫీట్లు వెనకకు జరిపి వచ్చిపోయే వారికి ఇబ్బంది లేకుండా చేశారు. కెపిహెచ్‌బి కాలనీ పోలసు స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## రేకుల షెడ్డు కూల్చివేత



మెహిదీపట్నం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : కార్వాన్ గుడిమల్కాపూర్ విశ్వేశ్వర్ నగర్‌లోని శ్రీకృష్ణభవన్‌కు సంబంధించిన రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. కార్వాన్ యాదవ సంఘంకు 1998-99వ సంవత్సరంలో అప్పటి టిడిపి ప్రభుత్వం దాదాపు 800 గజాల స్థలాన్ని కెటాయించింది. ఈ క్రమంలో యాదవ సంఘం సభ్యులు సగం స్థలంలో కృష్ణభవన్, మిగిలిన స్థలంలో షెడ్డున నిర్మించుకున్నారు. అయితే స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదని తరుచూ స్థలం వద్దకు వస్తుండడంతో ఈ విషయమై ఆసీఫ్‌నగర్ రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో పాటు న్యాయస్థానం నుంచి స్టేటస్‌కో ఆర్డర్ తీసుకోవడం జరిగింది. అయితే సోమవారం ఆసీఫ్‌నగర్ తహశీల్దార్ సిరిప్రగడ జ్యోతి తన సిబ్బందితో పాటు పెద్ద ఎత్తున పోలీస్ బలగాలతో శ్రీకృష్ణభవన్ వద్దకు చేరుకొని రేకుల షెడ్డును పూర్తిగా నేలమట్టం చేశారు. కూల్చివేతలను యాదవ సంఘం ప్రతినిధులు అడ్డుకునే ప్రయత్నం చేస్తుండడంతో పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు.

## చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఫణీంద్రారెడ్డి



సికింద్రాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: చీఫ్ చేషనింగ్ ఆఫీసర్‌గా జి. ఫణీంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న బాల మాయాదేవి బీసీ సంక్షేమం కమిషనర్‌గా బదిలీ కావడంతో వెయిటింగ్‌లో ఉన్న ఫణీంద్రారెడ్డి సీఆర్‌ఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

## ఆరోపణలు నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ తనవ్యక్తిగత రువుకు నష్టం కలిగించిన ఉద్యోగ సంఘాల నేతలపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఐపిఎంపై ,తనపై తప్పుడు ప్రకటనలు చేసిన ఉద్యగ సంఘ నేతలపై చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. టిఎన్జీవోస్ నగర అధ్యక్షులు కె.శ్రీకాంత్ మాట్లాడుతూ టిఎన్జీవో నేతలపట్ల వ్యక్తిగతంగా, యూనియన్‌పై అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టిఎన్జీవో సెంట్రల్ యూనియన్ నేతలు చిలుక నర్సి హ్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేష్‌గౌడ్, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మల్లారెడ్డి, ఎ.శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ఐపిఎం నేతలు శ్రీనివాస్‌రావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### కరెంట్ మీటర్లకు ఫోన్ నంబర్ లింక్ చేసుకోండి

నిజాంపేట్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త : ఎలక్ట్రికల్ మీటర్ సర్వీసుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలి విద్యుత్ వినియోగదారులకు టిఎస్ఎస్‌పిడిసిఎల్ విద్యుత్ అధికారులు సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఎలక్ట్రికల్ బిల్లు ఎప్పటికప్పుడు మెసేజ్ ద్వారా వస్తుందని, ఎప్పుడైనా ఎలక్ట్రికల్ ప్రాబ్లమ్ వచ్చి పవర్ కట్ అయితే మీకు ముందుగా ఈ టైమ్ నుండి ఈ టైం వరకు పవర్ కట్ ఉంటుందని మెసేజ్ వస్తుందని, బిల్లు కడితే బిల్లు కట్టినట్లు మెజేస్ కూడా వస్తుందని తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నం.49/EE-6/CRZ/GHMC/2023-24, తేది: 05.02.2024, పని స్వభావం: స్మశానవాటిక పనులలో అటవీ మొక్కల తొలగింపు పరిశుభ్రత. అంచనా ధర (రూ.లక్షలలో): 66.44. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 1 నుండి 25 కొరకు. డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 07.02.2024 సా.04.00 గం. వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేది: 12.02.2024 సా.04.00 గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ ఎమ్.వీరేసింగ్, EE డివిజన్-6, CRZ, GHMC, హైదరాబాద్, ఫోన్ నం.9154960551. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. గమనిక: టెండర్ ప్రకటన తేదీ తర్వాత 1% బయానా తప్పక పొందవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నం.6, చార్మినార్ డివిజన్, GHMC
DIPR.No.10113-PP/CL/Advt/1/2023-24, తేది: 05.02.2024

వార్త VAARTHA CLASSIFIEDS

డాక్యుమెంట్లు పోయినవి
★ నేను దోనూర్ క్రిష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి, ఇం.నం.5-70/3, బంగారిగడ్డ, చౌటుప్పల్ (మం), యాదాద్రి భువనగిరి జిల్లా-508252. ఎల్.బి.నగర్ నుండి చౌటుప్పల్ ప్రయాణం చేస్తుండగా నా డాక్యుమెంట్లు నం.6732/2006, 7849/2006, 5827/2007, 3968/2003, 10742/2008, 4347/2023 మరియు పాస్‌పోర్ట్ నం.B8815268, తేది: 29.01.2024న పోయినవి. నా కాంటాక్ట్ నం: 9948485475.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD
O.S.No. 1387 of 2022
Between:
**Canara Bank,** Abids Branch, Hyderabad ...**Plaintiff**
And
**Sri Valluri Srinivas and another** ...**Defendants**
To,
1) **Sri Valluri Srinivas** S/o V. Nataraju, Aged bout 53 years, Occ: Police Constable, R/o Flat No.C-11, Greenpark Colony, Saroornagar, Hyderabad. Ph No: 9247794781.
2) **Sri A.V. Subbarao** S/o A. Janardhana Rao, Aged about 50 years, Occ: Police Constable, R/o 8-152/2, Prasoona Nagar, Chintal, Hyderabad-500054. Ph No: 9441302139.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.2,09,816/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **21st February, 2024, at 10.30 am.** in default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Rood No.4, S.R.L. Colony, Kothapet, Hyderabad.
**Cell: 98492 64568**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 5, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ మున్సిపల్ 2024- 25వ ఆర్థిక సంవత్సరానికి గాను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా వార్డు కౌన్సిలర్లు చొరవ చూపించాలని, ప్రజల కు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని సూచించారు. అనం తరం మున్సిపల్ కమీషనర్, ఛైర్మన్‌లు 2024-25వ ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాధించడంతో కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది ఏకగ్రీవంగా ఆమోదించారు.

### వార్షిక బడ్జెట్ వివరాలు..

ప్రారంభ నిల్వ, ప్రభుత్వ గ్రాంట్లు కలుపుకొని అంచనా మొత్తం ఆదాయం రూ.2637.31 లక్షలు, మొత్తం వ్యయం అంచనా రూ.2579.90లక్షలు గాను, ముగింపు నిల్వ (మిగులు) రూ.57.41 లక్షలుగా, సొంత రెవెన్యూ (487.35+1532.96) ప్రారంభ నిల్వ కలుపుకొని రూ. 2020.31 లక్షలుగా ఉన్నాయి. అదేవిధ:గా సొంత రెవెన్యూ వ్యయం (పారిశుధ్య, నిర్వహణ, పవర్ ఛార్జీలు, గ్రీన్ బడ్జెట్ 1/3 వెనుకబడిన ప్రాంతాలు , పరస్పర విలీన ప్రాంతాలు, ప్రజా సౌకర్యాలు, వార్డుల వారిగా ఖర్చులు, జీతాలు కలిపి రూ.1962.90 లక్షలుగా, గ్రాంట్స్ ఆధాయం రూ.617.00లక్షలు, గ్రాంట్స్ వ్యయం రూ.617.00గా బడ్జెట్‌ను అంచన వేయడంతో కౌన్సిల్ మెంబర్లు అందరు ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహారాష్ట్ర వాసులు అరెస్టు

**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వ్యక్తులను శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 31 కిలోల 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 4 సాయంత్రం ఇద్దరు వ్యక్తులు విశాఖపట్నం నుంచి శంకర్‌పల్లికి గంజాయిని తరలిస్తున్నారని సమాచారం అందడంతో శంకర్‌పల్లి చౌరస్తాలో కాపు కాచి ఒక ఆడ, ఒక మగ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో వారి వద్ద గంజాయిని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అరెస్టు అయిన వారు శ్యామ్ వైద్యనాథ్ గైక్వాడ్ (36), కౌస భాయ్ సోగేవాడు (55) కాగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు అయిన ఇద్దరు మహారాష్ట్రలోని పర్బని జిల్లా గంగా కేడ్ గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపార్లు.

## గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**తహసీల్దార్ కృష్ణ**



చేవెళ్ల పంచాయతీ పాలకవర్గంకు వీడ్కోలు సమావేశంలో సన్మానిస్తున్న దృశ్యం

**చేవెళ్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని తహసీల్దార్ కృష్ణ అన్నారు. ఐదేళ్ల పాటు చేవెళ్ల గ్రామ ప్రజల అండదండలతో గ్రామాభివృద్ధికి సహకరించిన చేవెళ్ల పాలకవర్గం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం చేవెళ్ల గ్రామ పంచాయతీలో కార్యాలయంలో వీడ్కోలు పలికారు. చేవెళ్ల సర్పంచ్, వార్డు సభ్యులను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడు తూ...తమకు రాజకీయ జీవితం ఇచ్చి గత ఐదేళ్ల క్రితం చేవెళ్ల సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా గెలిపించిన గ్రామ ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ఏమిచ్చిన మీ రుణం తీర్చుకోలేనిదన్నారు. చేవెళ్ల గ్రామ ప్రజలకు జీవితాంతం అండగా ఉంటామని అన్నారు. ఐదేళ్ల సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలంలో గ్రామస్తుల సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. పదవులు ఉన్న లేకున్న ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, అంగన్‌వాడి టీచర్, ఆశావర్కర్లు తదితరులున్నారు.

### ఈ నెల 7న మాన రమాబాయి అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

**చేవెళ్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** ఈ నెల 7న మాత రమాబాయి అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బేగరి ప్రభాకర్, అంబేద్కర్ సంఘం చేవెళ్ల అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్‌లుం అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో జయంతి, సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బారత రాజ్యాంగ నిర్మాతా బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రతి పోరాటంలో మాత రమాబాయి అంబేద్కర్ త్యాగం ఉన్నదని గుర్తుచేశారు. ఒకవైపు కుటుంబ బాధ్యతల్ని నిర్వహిస్తూ మరోవైపు అంబేద్కర్ ఉన్నత విద్యాకోసం, వారి పోరాటానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాలల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, వినోద్, శ్రీనివాస్, సత్యనారాయణ, గణేష్, గోపాల్, ఆనంద్ ఉన్నారు.

## క్రిటికల్ కేర్ బ్లాక్ ఆసుపత్రి భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

**వికారాబాద్,ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:** క్రిటికల్ కేర్ బ్లాక్ ఆసుపత్రి భవన నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మం జుల భూమి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు రూ.16కోట్ల కేంద్ర, ప్రభుత్వ నిధులతో వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ నగర్ దగ్గర గల ూతన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి అ ుసంధానిస్తూ 50 పడకలతో ూతనంగా నిర్మించ ున్న క్రిటికల్ కేర్ బ్లాక్ ఆసుపత్రి కి భూమి పూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్‌రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, మాజీ జెడ్పిటిసి ముత్తాహర్ షరీఫ్, కౌన్సిలర్లు మురళి, వేణుగోపాల్ రెడ్డి, కొండేటి కృష్ణ, కాంగ్రెస్ నాయ కులు వెంకట్‌రెడ్డి, మాలే లక్ష్మణ్, మొముల రాజ్‌కుమార్, హసిబ్, యాదగిరి, ఫరూక్, సరాపు సాయికృష్ణ, మల్లికార్జున్ గౌడ్, చందు, హాస్పటల్ సూపరింటెండెంట్ రామచంద్రయ్య, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ జీవరాజ్ తదితరులు పాల్గొన్నారు.




ఎదులాబాద్‌లో నీటిట్యాంకును ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

## గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకాధికారులు, ఎంపిటిసి సభ్యులు కృషి చేయాలని మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం మర్రిపల్లిగూడ, ఎదులాబాద్, మాదారం గ్రామాల్లో సోమవారం ఆయన ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ.75 లక్షలతో ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభించారు. మర్రిపల్లిగూడలో రూ.12.20 లక్షలతో పలుచోట్ల నిర్మించిన సిమెంట్‌రోడ్లు, ఎదులాబాద్ గ్రామంలో ఆర్‌డబ్ల్యుఎస్ జడ్పీజిఎఫ్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన 90 కెల్ సామర్థ్యం కల్గిన ఉపరితల జలభాండాగారం, రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్లు, రూ.5 లక్షలతో నిర్మించిన భూగర్భడ్రైనేజీ, రూ.6.67 లక్షలతో పూర్తి చేసిన ఆర్‌ఎఫ్ నిర్వహణ పనులకు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోత్సవాలు గావించారు. ఈసందర్భంగా జడ్పీచైర్మన్, ఎంపిపిలను నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ వై.అరుణ, ప్రత్యేకాధికారులు-ఎంపిఓ బి.నందకిషోర్, బి.బలరామారావు, ఎంపిటిసి సభ్యులు కందుల సరళ, గట్టగల్ల రవి, కొమ్మిడి శోభారాణి, కోఆప్షణ్ సభ్యులు ఎండి.ఇక్బాల్, ఆర్‌బిఎస్ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మిషన్‌భగీరథ డిఈఈ అర్చన, ఇంట్రా ఏఇ శ్యామియెల్, గ్రిడ్ ఏఇ హరిణి, జడ్పీ ఏఇ జగపతి, ఉపసర్పంచ్ మాయ నరేశ్, మాజీ సర్పంచులు చిలుగూరి మంగమ్మ, సాయిలు, మాజీ ఎంపిటిసి కందుల కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాంమోహన్‌రావు, మాజీ ఉపసర్పంచులు కొమ్మిడి దామోదర్‌రెడ్డి, బాలవెంకటేశ , సహకార సంఘం డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరక్టర్లు బొక్క ప్రభాకర్‌రెడ్డి, గాయరు విశ్వనాథం, జవాజి సత్తయ్య, మాజీ వార్డుసభ్యులు బెలె సురేశ్, బింగి యుగంధర్‌గౌడ్, ఏర్పుల వెంకటేశ్, బొక్క జంగారెడ్డి, నాయకులు సామల అమరేందర్, బొంత రాజిరెడ్డి, మేకల కుమార్, కంట్లం ఓంప్రకాష్, మాచర్ల అంజనేయులు, శ్రీకాంత్, మడ్డి రవిగౌడ్, బొక్క సుధాకర్‌రెడ్డి, కందుల రామకృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాలెను పరామర్శించిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి



ఎమ్మెల్యే కాలెను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

**చేవెళ్ల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి,సీనియర్ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు పరామర్శించారు. సోమవారం నగరంలోని యశోద ఆసుపత్రిలో అనారోగ్యం కారణంగా చికిత్స తీసుకుంటున్న ఎమ్మెల్యే కాలె యాదయ్యను పరామర్శించారు. అనంతరం ఆరోగ్యం గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## జిల్లా సలహా కమిటీ యూత్ ప్రోగ్రామ్

**మెంబర్‌గా తోకల నరేశ్ నియామకం**



.తూంకుంటకు చెందిన బిజెపి నాయకులు తోకల నరేశ్‌యాదవ్ డిఎసివైపి మెంబర్‌గా నియామకపత్రాన్ని జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్న దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

జిల్లా సలహా కమిటీ యూత్ ప్రోగ్రామ్ (డిఎసివైపి) మెంబర్‌గా తూంకుంట గ్రామానికి చెందిన బిజెపి నాయకులు తోకల నరేశ్‌యాదవ్ నియమితులయ్యారు. ఎన్‌వైకెఎస్,యూత్,క్రీడల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఆయనను నియమించారు. సోమవారం మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. యువజన కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున ఆయనను కేంద్ర మంత్రి నియమించినట్లు పేర్కొన్నారు. దీనిలో వారితో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు బుద్ది శ్రీనివాస్, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమలరెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. తోకల నరేశ్‌యాదవ్ జిల్లా కమిటీ మెంబర్‌గా నరేశ్‌యాదవ్ నామినేట్ అయినందున బిజెపి నాయకులు సన్మానించి అభినందించారు.

### ఐఎస్‌సిఆర్ 17 వార్షిక సదస్సు

క్లినికల్ రీసెర్చ్ నిపుణులు సంఘం ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రిసెర్చ్ తమ 17వ వార్షిక సమావేశాన్ని హైదరాబాద్‌లోని హోటల్ నోవా టెల్లో ఫిబ్రవరి 1న ప్రీ కాన్ఫరెన్స్ వరాప్లు మరియు 2,3 తేదీల లో రెండు రోజులపాటు ప్రధాన సమావేశాలు నిర్వహిస్తుంది. మెరుగైన రోగి ఫలితాలకోసం క్లినికల్ రిసెర్చ్‌లో మార్పులు అనే నేపథ్యంతో నిర్వహించే ఈ సదస్సులో 1800 మంది వ్యక్తులతో పాటు 300 మంది ప్రముఖ స్పీకర్లు మరియు క్లినికల్ పరిశోధకులు భారతీయ మరియు గ్లోబల్ ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైస్ డయాగ్నోస్టిక్స్ కంపెనీలు రీసెర ్చ ట్రైనీలు తదితరులు ఒక చోట చేసి మార్పు ఆరోగ్య సంరక్షణ భవిష్యత్‌ను రూపొందిస్తారు.

## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శుల నియామకం

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** బీజేపీ మెదక్ జిల్లా నూతన జిల్లా ప్రధాన కార్యదర్శులుగా చిమ్మనమైన శ్రీనివాస్, ఎం.లక్ష్మీనరసింహారెడ్డి, గోడ రాజేందర్‌లను నియమించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రకటించారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం పనిచేస్తున్న నరేంద్ర మోడీని మూడవ సారి ప్రధాన మంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, పార్టీని సంస్థాగతంగా బలోపే తం చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎర్రోళ్ల మురళీ యాదవ్, మెదక్ నుంచి పోటీ చేసిన పంజా విజయ్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి మధు, నల్లాల విజయ్, సీనియర్ నాయకులు వెలముల సిద్ధిరాములు, ముక్క సుధాకర్, సంగసాని సురేష్, రామాయంపేట మండల ఇంచార్జి తీగల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు ప్రభాకర్, రాజు, మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, నాయకులు చింతల శేఖర్ పాల్గొన్నారు.

# ఈవిఎం,వివి ప్యాట్ల ఎఫ్ఎల్‌సి నిర్వాహణ పరిశీలించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

ఈవిఎం, వివిప్యాట్ల ఎఫ్ఎల్‌సి నిర్వాహణ పారదర్శకంగ జరగాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మొదటి స్థాయి పరిశీలనలో జాగ్రత్తగ ఉండాలని ఆయన అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటింగ్ ఈవిఎం,వివిప్యాట్ల ఎఫ్ఎల్‌సి నిర్వాహణ జరిగింది. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో వాటి ఫస్ట్ లేవల్ చెక్‌ను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మొదటి విడత తనిఖీలో ఈవిఎంలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ నెల 5నుంచి 14వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 7వరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగ ఈవిఎంల తనిఖీ జరుగుతుందన్నారు. ఈవిఎంలపై ఎలాంటి అనుమానాలకు చోటు లేకుండ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవిఎంల ఎఫ్ఎల్‌సి నిర్వాహణకు 26మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుందన్నారు. నిబంధనలను పాటిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి గోడౌన్లను కలెక్టర్ గౌతమ్, ఆయా రాజకీయ పార్టీల వారి ఆధ్వర్యంలో అందులోని ఈవిఎం,వివిప్యాట్లను పరిశీలించారు. జిల్లాలోని కూకట్‌పల్లి, మేడ్చల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్షన్ పిటిషన్లు ఉండటం వల్ల ఆ గోడౌన్లను తెరవలేదని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈవిఎం,వివిప్యాట్ల ఎఫ్ఎల్‌సి నిర్వాహణతో పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అదనపు కలెక్టర్, డిఆర్ఓ

## ఐదేళ్ల లోపు పిల్లలందరికి ఇంటెన్సీవ్ పోలియో ఇమ్యునైజేషన్ అందించాలి

**డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాధస్వామి**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాధస్వామి,పాల్గొన్న తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

ఐదేళ్ల లోపు పిల్లలందరికి ఇంటెన్సీవ్ పోలియో ఇమ్యునైజేషన్ కోసం క్యాంపులు నిర్వహించాలని మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాధస్వామి సూచించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ (డిఎంహెచ్ఓలో) కార్యాలయంలో జిల్లా వైద్యఅధికారులతో పాటు సిబ్బందికి మాస్ స్కేల్ ఇమ్యునైజేషన్ డ్రైవ్‌ను నిర్వహించటానికి సంసిద్ధతను నిర్ధారించటానికి ప్రాధమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్య అధికారులందరికి డబ్ల్యుహెచ్ఓ కన్సల్టెంట్ ద్వారా శిక్షణ్యా కార్యక్రమం డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాధస్వామి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికి వైద్యం అందించాలని, స్కేల్ ఆఫ్ కవరేజ్‌ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగ బస్‌స్టేషన్లు, ప్రార్ధనా స్థలాలు, రైల్వేస్టేషన్లు, సహ అన్ని బహిరంగ ప్రదేశాల్లో విస్తరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని ప్రాధమిక, ప్రభుత్వ ఆసుపత్రులు,సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, లైన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. విద్యాశాఖ, సమగ్రశివు ఆరోగ్యశాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా స్వయం సహాయక బృందాలు, నర్సింగ్ కళాశాలల వాలంటీర్లు పోలియో టీకాల కార్యక్రమంలో నిమగ్నం కావాలన్నారు. వసల జనాభా, సంచార సంఘాలు, నిరాశ్రయుల కవరేజిని విస్తరించటానికి, బూత్‌లేవల్‌లో టీకాలు వేయకుండ తప్పిపోయిన పిల్లలను గుర్తించి టీకాలు వేయటానికి ఇంటింటికి రౌండ్లు నిర్వహించాలని అధికారులను డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాధస్వామి వారిని ఆదేశించారు.

## 128 మందికి కళ్యాణలక్ష్మి,షాదిముబారక్ చెక్కుల పంపిణీ



లబ్దిదారులకు కళా ్యణలక్ష్మీ చెక్కులను అందిస్తున్న కడా ప్రత్యేకాధికారి,ఎంపీపీ

**కొడంగల్,ఫిబ్రవరి 5ప్రభాతవార్త**

కొడంగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 128 మంది లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణలక్ష్మి,షాదిముబారక్ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి,ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,మున్సిపల్ చేర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి,కాంగ్రేస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్‌లు అందజేశారు.సోమవారం పట్టణంలోని కడా కార్యాలయంలో లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతు ప్రభుత్వం పేద కుటుంబాల్లో కళ్యాణ కాంతులు నింపేందుకు కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ అందిస్తు వారికి ఆర్ధికంగా తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు.పేద కుటుంబాల్లో వివాహాల జరిపించేందుకు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆదుకోవడంతో పేదల ఇంట్లో కళ్యాణకాంతులు నిండుకున్నట్లు పేర్కొన్నారు.మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంభందించి మొత్తం 128 మంది లబ్దిదారులకు చెక్కులను అందుకుంటున్నారని,చెక్కులు అందుకున్న లబ్దిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చేర్మేన్ ఉషారాణి,కౌన్సిలర్‌లు రమేష్,మునీర్, పీఏసీఎస్ అద్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త,యువజన కాంగ్రేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు,రాములు,రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల ఎఫ్ఎల్‌సీను పర్యవేక్షించిన కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:**

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యాంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన (ఎఫ్ఎల్‌సీ) జరిపేందుకు ఈసీఐఎల్‌కు చెందిన 7 మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుంది. ఈ బృందం దాదాపు పది రోజుల పాటు ఇక్కడే ఉండి ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను తెరిపించారు. స్థానకంగా గల 1197 బ్యాలెట్ యూనిట్లు, 947 కంట్రోల్ యూనిట్లు, 911 వీవీ ప్యాట్‌లను నిపుణుల బృదం పరిశీలిస్తుందని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

## అనంతరావు కులకర్ణికి ఉత్తమ పిపి ఆవార్డు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** మండలంలోని వాసర్ గ్రామానికి చెందిన అనంత్‌రావు కులకర్ణి ఉత్తమ పీపీ అవార్డును అందుకున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్‌కు చెందిన ఓ ఘటనలో నిందితుడికి జీవితఖైదు పడేందుకు కృషి చేసినందుకు గాను రాష్ట్ర స్థాయి ఉత్తమ పీపీగా అనంత్‌రావు కులకర్ణిని ఎంపిక చేసి అవార్డును బహుకరించారు. సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో అనంత్‌రావు కులకర్ణికి అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు శికాగోయల్ అవార్డును అందచేశారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** బెజ్జంకి మండల పరిధిలోని గుగ్గిళ్ల, తిమ్మాయపల్లె గ్రామాల సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ఇథనాల్‌కంపెనీ వ్యతిరేఖ పోరాట సమితి అధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆందోళనలో ప్రజలు,రైతులు పాల్గొని ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీతో కాలుష్యం పెరుగుతుందన్నారు. కాలుష్యం పెరగడంతో మనుషులు, పశువులు అనారోగ్యాలకు గురవుతారని తెలిపారు ప్రాణాలకే మప్పుతో పాటు భూగర్భ జలాలు కలుషితం చేసే అవకాశం ఉన్నందను ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటును నిలిపి వేసే వరకు ఆందోళనలు చేస్తామన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

**-ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్**

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికల సమయంలో విశ్వరూప మహాసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాదిగలకు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీ నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చించి మాదిగలకు అనుకూలంగా తీర్పునిచ్చి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తే మాదిగల మద్దతు సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ భూములకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణ పట్టా హక్కులను కల్పించాలన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శులు ఎర్రోళ్ల సంజీవులు మాదిగ, ఎర్ర లింగం, గుడ్డి కృష్ణ, జిల్లా నాయకులు బాలసాయి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 16న దేశ వ్యాప్త సమ్మె : సిఐటియు

**పుల్కల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక , ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 16వ తేదీన దేశ వ్యాప్త సమ్మెకు పూనుకుంటున్నట్లు సిఐటియు అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యా సాగర్ పేర్కొన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు పిఎస్సీ పరిధిలో సమ్మె నోటును అందచేశారు. ఈ సందర్భంగా విద్యా సాగర్ మాట్లాడుతూ కరోనా కట్టిడికి ముఖ్య పాత్ర పోషించిన ఆశా వర్కర్లులకు నేటికిని ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించలేదని దుయ్యబట్టారు. ఆశా వర్కర్లకు వెంటనే అవసరమైన సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటిన ఈ తరుణంలో ఆశలు కనీస వేతానాలు అందుకోలేక అర్ధాకలితో కడుపులు మాడ్చుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఉన్నారు.

## సర్కిల్ నేర సమీక్ష సమావేశం

**నేరాల పురోగతి, దొంగతనాల ఛేదనపై అధికారులకు సూచనలు**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు సంబంధించిన ఎస్ఐలు, ఇన్వెస్టిగేషన్ అధికారులతో సోమవారం సిఐ ఎర్రల కిరణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ జరుగుతున్న నేరాలు,వాటి పురోగతి,దొంగతనాలు,వాటి చేదనతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ కోసం వారు తీసుకుంటున్న చర్యలను గురించి అడిగి తెలుసుకుని వారికి పలుసూచనలు చేశారు. సమీక్ష సమావేశంలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్, అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్, కోహెడ ఎస్ఐ సదువాల తిరుపతి, ఇన్వెస్టిగేషన్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ కౌన్సిలర్‌గా చిత్తారి పద్మ

**హుస్నాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ చిత్తారి పద్మను జాతీయ ఉత్తమ కౌన్సిలర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో జరిగిన అవార్డు సెక్షన్స్ సమావేశంలో పద్మకు ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణ మాట్లాడుతూ పద్మ హుస్నాబాద్‌లో కౌన్సిలర్‌గా రెండు సార్లు గెలిచి వార్డులోని ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు.కరోనా విపత్కర సమయంలో బాదిత కుటుంబాలకు అండగా నిలుస్తూ వారికి బియ్యం,నిత్యవపర సరుకులు పంపిణీ చేశారన్నారు.తాను ప్రాతినిత్యం వమిస్తున్న వార్డులో త్రాగునీరు,వీధి ద్వీపాలు,పారిశుధ్యం,హరితహారం,వంటి ఎన్నో సౌకర్యాలు కల్పించి మహిళా ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తున్న వారి సేవలను గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సూచించారు.ఎంపికైన ఈ అవార్డును ఈనెల 11న తిరుపతిలో జరిగే దక్షణ భారత బహుజన రచయితల సదస్సులో బహుకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం,ఎం గౌతమ్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**ఇంటర్ విద్యార్థి దుర్మరణం**

**జహీరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఇంటర్ విద్యార్థి తిరిగిరాని లోకాలకు చేరిపోయిన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. ఎస్ఐ కే శ్రీకాంత్ కథనం ప్రకారం... పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఈప్తి శ్రీకాంత్ ఆర్ఎల్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో విద్యను అందుకుంటున్నాడన్నారు. సోమవారం కళాశాలకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో కళాశాల గేడులోకి ప్రవేశిస్తుండగా జహీరాబాద్ నుంచి న్యాల్క ల్‌కు వెళుతున్న జహీరాబాద్ డిపో బస్సు శ్రీకాంత్ బైక్‌ను ఢీకొందన్నారు. ప్రమాదాన్ని గమనించిన కళాశాల సిబ్బంది క్షతగాత్రుడు శ్రీకాంత్‌ను జహీరాబాద్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కొరకు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడన్నారు.

## అయోధ్యకు తరలిన బిజెపి కరసేవకులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ నుంచి సోమవారం అయోధ్యకు బయలుదేరిన మొదటి రైలులో ఎదులాబాద్ బిజెని నాయకులు వెళ్లారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, కృష్ణ, చింతల రామచంద్రారెడ్డిలు జెండా ఊపి అయోధ్య రైలును ప్రారంభించారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామానికి చెందిన బిజెపి కరసేవకులు కాలేరు రామోజీ, సాల్వేరు రఘు, చిత్తం రావు, రాజు, వెంకటేశ్, పెంటాజీ, మధు, నాగేశ్, భానుప్రకాష్, సతీష్‌లు అయోధ్య తొలి రైలులో ప్రయాణించే అవకాశం రావడంతో రైలు బయలు దేరారు. కరసేవకుల జైశ్రీరామ్ నినాదాలతో రైల్వేస్టేషన్‌లో మారుమోగిందని తెలిపారు.